క్లుప్తంగా

నేత్రప్రదాయినికి ప్రత్యేక పూజలు



నగరి: పట్టణ పరిధిలోని నేత్రప్రదాయిని క్షేత్రంలో ఆదివారం ఆడి మాసోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అభిషేక అర్చనలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పొంగళ్లు పెట్టి మొక్కు తీర్చుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థం కళ్లలో చల్లుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాకారంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈఓ, ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

గంగాధరనెల్లూరు: ఆడినెల మాసం సందర్భంగా యట్టేరిలోని శ్రీవల్లీ దేవసేన సమేత శివ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆనంద అయ్యంగార్ ఆధ్వర్యంలో విశేష సుగంధ ద్రవ్యాలతోఅభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో కావళ్లు చెల్లించారు.

ఓంశక్తి ఆలయంలో ఆడి పూజలు



అలంకరణలో అమ్మవారు



అత్తూరులో అన్నదాన కార్యక్రమం

నింద్ర: మండలంలోని ఓంశక్తి అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళ మాసం ఆడి నెల పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

అత్తూరులో..

మండలంలోని అత్తూరు ఓం శక్తి ఆలయంలో అదివారం తమిళమాసం ఆడి నెల పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అంబళ్లు పోశారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో ఆడిపూజలు

గుడిపాల: బంగారక్క అమ్మవారికి ఆడిపూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం వసంతాపురం గ్రామంలోని మహిళలు పొంగళ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉదయం ఉపవాసాలతో అమ్మవారి వద్దకు వెళ్లి అభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. అక్కడే పొంగళ్లను పెట్టి మంగళ వాయిద్యాల నడుమ పూజలు చేశారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

సీఆర్‌కండ్రిగలో వినాయక వైభవం

గత వైఎస్‌ఆర్ సీపీ హయాంలో దళిత గ్రామాల్లోనూ ఆధ్యాత్మికతను పెంపొందించాలన్న ఉద్దేశంతో టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులతో ఆలయాల నిర్మాణానికి పూనుకున్నారు. ప్రస్తుతం ఆ పనులు పూర్తి కావడంతో ఆధ్యాత్మిక వైభవం పరిఢవిల్లుతోంది. ప్రధానంగా వెదురుకుప్పం మండలంలోని సీఆర్‌కండ్రిగ ఎస్సీ కాలనీలో నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం నూతన హంగులతో రూపుదిద్దుకుంది. మండలంలో ఏ ఎస్సీ కాలనీలో లేనివిధంగా ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. పెనుమూరు ప్రధాన రహదారి పక్కన నిర్మించిన ఈ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. – వెదురుకుప్పం



నూతన హంగులతో రూపుదిద్దుకున్న వినాయక స్వామివారి ఆలయం

- ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం
- ఎస్సీ కాలనీలో శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయ నిర్మాణం

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. దీంతో వెంటనే స్పందించిన నారాయణస్వామి దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఆలయ నిర్మాణానికి పెనుమూరు ప్రధాన రహదారి పక్కన పూర్వపు తహశీల్దార్ చిన్నయ్య 30 సెంట్లు ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీంతో కాంట్రాక్టర్, ఆలయ ధర్మకర్త మరకాలకుప్పం రామయ్య ప్రత్యేక చొరవ తీసుకుని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దారు. సాధారణంగా ఒక్క వినాయకుడి గుడి మాత్రమే కాకుండా కుమార స్వామి, నాగదేవతల ఆలయంతో పాటు వీరాంజనేయ స్వామి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు.

రూ.75 లక్షలతో నిర్మాణం

ఆలయ నిర్మాణానికి ముందు 15 అడుగుల ఎత్తులో మూడు అడుగుల వెడల్పుతో 226 అడుగులతో ప్రహరీ గోడ నిర్మించారు. ఇందులో ప్రధాన ఆలయంగా శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ఆవరణలోనే కుడి పక్కన సుబ్రమణ్య స్వామి ఆలయ నిర్మాణం చేపట్టారు. వినాయక ఆలయానికి ఎడమ వైపున నాగదేవతల ఆలయం నిర్మించారు. ఆలయానికి వెళ్లేందుకు ప్రధాన గేటు వద్ద పెద్ద ఎత్తున ఆర్చి నిర్మాణం జరిగింది. ఆలయానికి ముందు 12 అడుగులతో వీరాంజనేయ స్వామి విగ్రహాన్ని ఉంచారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. 7005 అడుగుల గ్రానైట్ రాళ్లతో ఫ్లోరింగ్ వేశారు. ఆలయానికి చుట్టు పక్కలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. అది కాకుండా రూ.20 వేలు విలువ చేసే ఫ్లడ్ లైట్లు అమర్చినట్లు కాంట్రాక్టర్ తెలిపారు.



ఆలయం ముందు వీరాంజనేయ స్వామి విగ్రహం



ఆకట్టుకుంటున్న ఆర్చి

నారాయణస్వామికి రుణపడి ఉంటాం



ఎంతో మంది పాలకులు వచ్చినా, ప్రభుత్వాలు మారినా మా గ్రామం అభివృద్ధిలో వెనకబడేది. జగనన్న సీఎం అయ్యాక అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మా గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పలు అభివృద్ధి పనులతో పాటు ఆలయ నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామస్తుల సహకారంతో దాతల సాయం కూడా పెద్ద ఎత్తున దోహదపడింది. ఎన్నో ఏళ్లుగా జరగని మంచి మా గ్రామానికి జరిగింది. ఈ స్థాయిలో ఆలయ నిర్మాణం జరుగుతుందని ఊహించలేదు. మా గ్రామస్తుల తరఫున మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం.

– ఎం. రామయ్య, కాంట్రాక్టర్, ఆలయ ధర్మకర్త

అన్ని సౌకర్యాలు సమకూర్చాం



సీఆర్‌కండ్రిగ ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మితమైన వినాయక స్వామివారి ఆలయానికి అన్ని రకాల వసతులను సమకూర్చాం. ముందుగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సౌకర్యం కల్పించాం. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి ఏర్పాటు చేశాం. ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో ఆలయం ఆవరణలో కల్యాణ మండపం నిర్మించేందుకు కృషి చేస్తాం. సీఆర్‌కండ్రిగ చరిత్రలో నిలిచిపోయేలా ఆలయ నిర్మాణం జరిగింది. తరతరాలుగా చెప్పుకునేలా ఊహించని స్థాయిలో డబ్బులు పెట్టాల్సి వచ్చింది. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు.

– శిల్ప, సర్పంచ్, వెదురుకుప్పం

సేవలకు స్కౌట్ అండ్ గైడ్స్ సిద్ధం



శిక్షణలో పాల్గొన్న స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు

పుత్తూరు: పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజుల స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో సేవలందించడానికి స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక కామరాజ్‌నగర్‌లోని స్కౌట్ శిక్షణా కార్యాలయం వద్ద 250 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన అర్జున తపస్సు, రథోత్సవం, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటారని, ఆ సందర్భంగా ఎలాంటి తొక్కిసలాటలకు తావు లేకుండా స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. భక్తులను క్రమపద్ధతిలో తరలించడంతో పాటు వారికి అవసరమైన తాగునీరు అందించే సేవల్లో విద్యార్థులు చురుకైన పాత్ర పోషిస్తారని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ అశోక్, రేంజర్ లీడర్ శైలజ, యువశ్రీ, భాను, మేఘన, చారులత పాల్గొన్నారు.

వైభవంగా గుర్రప్పస్వామి తిరునాళ్ల

తవణంపల్లె: మండలంలోని అరగొండలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గుర్రప్ప స్వామి తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు స్వామికి పూజాసామగ్రి, సుగంధ పరిమళ పుష్పాలు, ప్రసాదాలను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సమర్పించారు. అనంతరం గుర్రప్ప స్వామికి అభిషేకం, పూజలు చేయించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రిలో గుర్రప్ప స్వామిని పల్లకిలో ఊరేగించారు. భక్తులు ఇంటింటా పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

నక్కలోళ్లం.. న్యాయం చేయండి!

- నాలుగు అడుగుల స్థలం చూపండి
- నల్ల పూసలు అమ్ముకొని పొట్టపోసుకొంటాం
- ధర్మరాజు తిరునాళ్లలో నక్కలోళ్ల వేడుకోలు



స్థలం చూపాలంటూ కోరుతున్న నక్కలోళ్లు

పుత్తూరు: 'ఊరికే వద్దు.. మా శక్తికొద్దీ డబ్బు కడతాం.. కాసింత స్థలం చూపి పుణ్యం కట్టుకోండి.. మీ ధర్మాన పొట్టపోసుకొంటాం' నక్కలోళ్లు ధర్మరాజుల ఆలయ నిర్వాహకులను వేడుకొంటున్నారు. పట్టణంలో జరుగుతున్న శ్రీదౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తోపును వేలం వేసి తాత్కాలిక అంగళ్ల నిర్వహణకు అనుమతించడం ఆనవాయితీ. అందులో భాగంగానే ఈ ఏడు తోపులో రంగుల రాట్నాలతోపాటు, వివిధ అంగళ్లు ఏర్పాటు అవుతున్నాయి. అదేవిధంగా ప్రతిఏటా తోపులో ఎక్కడో ఒకచోట నక్కలోళ్లు చిన్న చిన్న అంగళ్లు ఏర్పాటు చేసుకొని నల్లపూసలు, దువ్వెనలు అమ్ముకొని నాలుగు డబ్బులు సంపాదించుకొంటారు. అయితే ఈ ఏడు తిరునాళ్ల సందర్భంగా ఏటా తాము అంగళ్లు పెట్టుకొనే చోట ఇతరులకు స్థలం కేటాయించడంతో తమ బతుకు పోయిందని నక్కలోళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా పది నక్కలోళ్ల కుటుంబాలు ఇదే తోపులో ఏళ్ల తరబడి నివశిస్తున్నాయి. ఏడాది పొడవునా రోడ్డు పక్కల్లో అక్కడక్కడా చిన్నపాటి అంగళ్లు పెట్టుకొని కొందరు, ఊరూరా తిరుగుతూ పూసలు అమ్ముకొంటూ మరి కొందరూ జీవిస్తున్నారు. కొన్నేళ్లుగా వీరందరూ తిరునాళ్లలో అక్కడక్కడా చిన్నిపాటి అంగళ్లు పెట్టుకుంటున్నారు. ఈ ఏడు వారికి స్థలం కేటాయించకపోవడంతో వారు తమకు న్యాయం చేయండంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమకు కాసింత స్థలం చూపి ఆదుకోవాలని కోరుతున్నారు.

సీఎస్ఐ చర్చి ప్రారంభం



ప్రారంభోత్సవంలో సీఎస్ఐ వేలూరు డయాసిస్ రెవరెండ్ బిషప్ శర్మ నిత్యానందం

గంగాధరనెల్లూరు: మండలంలోని న్యూ వేల్కూర్ గ్రామ సరిహద్దు కొండపై నూతనంగా నిర్మిస్తున్న సీఎస్ఐ చర్చిలో నూతనంగా ద్వారాన్ని, ఎం.నాశం పల్లిలో పునర్నించిన సీఎస్ఐ చర్చి, ప్రహరీ గోడను సీఎస్ఐ వేలూరు డయాసిస్ రెవరెండ్ బిషప్ శర్మ నిత్యానందం ప్రారంభించారు. కట్టక్రిందపల్లి హరిజనవాడలో బాధిత దినకరన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎట్టేరి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చి గంట గోపురాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెస్సీ సోఫియాశర్మ నిత్యానందం, స్థానిక బోధకులు సురేష్, వేల్కూరు కుట్టి, మండలంలోని అన్ని సీఎస్ఐ సంఘాల ఉపదేశకులు, సంఘస్తులు, మహిళలు పాల్గొన్నారు.

హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీక కార్వేటినగరం

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



డంకా హమీద్ బాషాను సన్మానిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

కార్వేటినగరం: హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీక కార్వేటినగరమని సీపీఐ జాతీయ కార్యదదర్శి డాక్టర్ కే.నారాయణ అన్నారు. స్థానిక హిందూ, ముస్లిం కల్యాణ మండపంలో ఆదివారం ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు డంకా హమీద్ బాషా ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. నారాయణ మాట్లాడుతూ కార్వేటినగరంలో హిందూ– ముస్లింలు అన్నదమ్ములుగా కలిసి ఉంటారని గుర్తు చేశారు. కార్వేటినగరంతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. ఇక్కడ నివసిస్తున్న హిందూ –ముస్లింలు కల్యాణ మండపానికి హిందూ, ముస్లిం పేరు పెట్టి శుభకార్యాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశంలో మతాల మధ్య గొడవలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకుంటున్న ప్రధాని మోదీ కార్వేటినగరానికి వస్తే హిందూ, ముస్లింల కలయికను చూసి జ్ఞానోదయం కలుగుతుందని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ డంకా హమీద్ బాషా ఎస్టీయూ నాయకుడిగా ఉపాధ్యాయుల సమస్యల కోసం పలు పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాళి వాహనంపై ద్రౌపదీదేవి అభయం





విశేష అలంకరణలో ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి, గెరిగ ఊరేగింపు

పుత్తూరు: శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి యాళి వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి భక్తులకు అభయమిచ్చారు. పట్టణ పురవీధుల్లో ఇంటింటా భక్తులు కర్పూర హారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 2గంటల నుంచి సాయంత్రం 5 వరకు స్వర్ణలత హరికథా గానం చేపట్టారు. సాయంత్రం పాండవ, కౌరవ కుమారుల విద్యాభ్యాస ఘట్టం ఆకట్టుకొంది. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన నాగరత్నమ్మ పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోటుపుస్తకాలు, వితరణ చేశారు. రాత్రి 8 గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడంతో, ద్రౌపదీ సమేత అర్జున స్వాములను సర్వాంగ సుందరంగా అలంకరించి యాళి వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 9 గంటలకు బెస్త సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం దేవస్థానం కోవిల్‌కార్ల ఆధ్వర్యంలో లక్కాగృహ దహనం ఘట్టాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

సోమవారం ఉదయం 6 గంటలకు గెరిగ ఊరేగింపు. సాయంత్రం 4 గంటలకు హిడింబాసుర వధ. రాత్రి 9 గంటలకు శేష వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు.

ఉమ్మడి జిల్లా చెస్ పోటీలు ప్రారంభం



చెస్ ఆడుతున్న జూనియర్ క్రీడాకారులు

నగరి: స్వాతంత్ర్య దినోత్సవం, నగరి చెస్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వీకేఆర్ పురం గ్రాండ్ వరల్డ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాల నుంచి జూనియర్ విభాగంలో 180 మంది సీనియర్ విభాగంలో 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సీఐ విక్రమ్ ముఖ్యఅతిథులుగా హాజరై చెస్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చదరంగంతో జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుందని, విజ్ఞానాన్ని పెంచుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 28 యేళ్ల క్రితం స్నేహితుల దినోత్సవం రోజు ఈ పోటీలను నగరిలో ప్రారంభించామన్నారు. తిరుపతి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభ వృద్ధులు చెస్ ఆడితే అల్జీమర్స్ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ హెచ్ ప్రభాకర్ రాజు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ ఫైనల్స్ జరుగుతుందని, అదే రోజున విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చెస్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ, ప్రతినిధి నవీన్ కుమార్, నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గజేంద్ర, కార్యదర్శి మోహన్, కోశాధికారి శక్తివేలు, సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ రవిబాబు, నగరి చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీల్‌బాషా, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.



చెస్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, సీఐ

ఊరూరా బెల్టు షాపులు

గ్రామాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు దగ్గరుండి విక్రయాలు చేయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కూరగాయల దుకాణాలకంటే బెల్ట్ షాపులే ఎక్కువగా ఉన్నాయి. మద్యం ఏరులై పారుతోంది. మద్యం దుకాణాల్లో లేని బ్రాండ్లు సైతం బెల్ట్ షాపుల్లో లభిస్తుండడం గమనార్హం. బెల్ట్ షాపుల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.





పెనుమూరు: కోళ్లపారంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపు

- కూరగాయల దుకాణాల కంటే బెల్ట్ షాపులే అధికం
- ఏరులై పారుతున్న మద్యం
- మద్యం దుకాణాల్లో లేని బ్రాండ్లు సైతం లభిస్తున్న వైనం
- నామమాత్రంగా దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నియోజకవర్గం వ్యాప్తంగా బెల్ట్ దుకాణాలు

మండలం	బెల్ట్ దుకాణాల సంఖ్య
పాలసముద్రం	10
కార్వేటినగరం	30
పెనుమూరు	40
జీడీనెల్లూరు	45-50
వెదురుకుప్పం	20
శ్రీరంగరాజపురం	20

సాక్షి టాస్క్‌ఫోర్స్: గంగాధరనెల్లూరు నియోజకవర్గం వ్యాప్తంగా 136 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిల్లో కొన్ని గ్రామాల్లో రెండు నుంచి 5కు పైగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్క ప్రకారం 133 బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కొన్ని మండలాల్లో మద్యం షాపునకు అనుమతి ఒక చోట ఉంటే మరోచోట షాపు నిర్వహిస్తున్నారు. పెనుమూరు మండలంలో టీడీపీకి చెందిన బడా నాయకులు పోటాపోటీగా కోళ్లఫారాల్లో బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. అదే విధంగా జీడీ నెల్లూరు, పాలసముద్రం, వెదురుకుప్పం, కార్వేటినగరం, శ్రీరంగరాజపురం మండలాల్లోనూ పచ్చనేతలు మినీ మద్యం షాపుల్లా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. వీటిలో ఆంధ్ర బ్రాండ్లే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలు రకాల బ్రాండ్ల మద్యం సైతం విక్రయిస్తున్నట్టు సమాచారం. ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని మహిళలు ఆరోపిస్తున్నారు.

మద్యం ప్రియుల జేబులకు చిల్లులు

మద్యం దుకాణాలు గ్రామాలకు దూరంగా ఉండడంతో అక్కడికి వెళ్లి మద్యం కొనుగోలు చేయలేని వారు గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. అక్కడ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అలాగే కర్ణాటక, తమిళనాడుకు చెందిన పలు బ్రాండ్ల మద్యంపైనా రూ.50 నుంచి రూ.100లు అధికంగా అమ్మకాలు చేస్తున్నారు. దీంతో మందు బాబుల జేబులు ఖాళీ అవడంతోపాటు కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్ట్ షాపులను అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేపంజేరి ఆలయానికి రూ.5.30 లక్షల విరాళం

గంగాధరనెల్లూరు: వేపంజేరిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి శ్రీనాథ్ అనే భక్తుడు తన స్నేహితులైన ముకుంద్, కన్నన్‌తో కలిసి రూ.5.30 లక్షల విరాళం ఇచ్చారు. హైదరాబాద్‌లో ఉంటున్న శ్రీనాథ్ అలియాస్ వెంకటేశ్‌స్వామి ఆలయంలో పైకప్పు, రేకుల షెడ్డు నిర్మాణం కోసం రూ.5.30 లక్షలు ఇచ్చినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గెరిగ ఊరేగింపు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ఆదివారం మునీశ్వరస్వామికి భక్తితో గెరిగ ఊరేగింపు చేశారు. భక్తిశ్రద్ధలతో మునీశ్వరస్వామి గెరిగను అలంకరించి పొంగళ్లు ఎత్తుకుని ఊరేగింపు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం వద్ద మునీశ్వర స్వామి మట్టితో ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆడిమాసంలో ఏటా మునీశ్వరస్వామికి భక్తులు భక్తిప్రపత్తులతో పూజలు చేయడం ఆనవాయితీ.



మునీశ్వరస్వామి గెరిగను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు